

శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బీర్జున్నీసా తదితరులు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్. జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణ కోసం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోడానికి స్థానికంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య పరీక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. శనివారం మూసారాంబాగ్ డివిజన్‌లోని ఇంద్రానగర్ బస్తీలో శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, కీళ్ల సమస్య నివారణ, కంటి పరీక్షలు, ఆబా కార్డుల జారీ వంటివి నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బీర్జున్నీసా, వైద్యాధికారి డాక్టర్ తరుణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎంపీఎల్ విజేత ఎంఎన్‌జీ జట్టు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలో నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ శుక్రవారం ముగిసింది. మొత్తం 8 జట్లు పాల్గొన్న ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో ఎంఎన్‌జీ, నైట్‌రైడర్స్ తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో ఎంఎన్‌జీ విజేతగా నిలువగా నైట్‌రైడర్స్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ గడ్డం బాలకిషన్‌గౌడ్ హాజరై విన్నర్, రన్నరప్ జట్లకు షీల్డ్‌తోపాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, గణేష్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, నిర్వహకులు యశ్వంత్, పవన్, నాని, అఖిల్, నిఖిల్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

అదనపు నీటి పైప్‌లైన్లు మంజూరు చేయండి

● జలమండలి ఎండీని కోరిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని శివారు ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చడానికి అదనపు మంచి నీటి పైప్‌లైన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కోరారు. శనివారం జలమండలి కార్యాలయంలో ఎండీని కలిసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో గతంలో దాదాపు 80 కిలోమీటర్ల మేర మంచినీటి పైప్‌లైన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. దానికి తోడు మరో 18 కిలోమీటర్ల మంచినీటి పైప్‌లైన్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. దీంతో నియోజకవర్గం పరిధిలోని శివారు ప్రాంతాల ప్రజల దాహార్తి తీర్చి వారికి మేలు చేసినట్లు అవుతుందన్నారు. అదేవిధంగా శివారు ప్రాంతాలలో నూతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లు మంజూరు చేయాలని కోరారు. దాదాపు రూ.40కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మూసారాంబాగ్‌లో కల్తీ నెయ్యి గుట్టురట్టు

పోలీసుల దాడి.. ఒకరి అరెస్టు

చాదర్‌ఘాట్. జనవరి 27(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి తయారు చేస్తున్న కేంద్రంపై మలక్‌పేట పోలీసులు సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లాలోని ఒట్టన్ సత్రం గామానికి చెందిన ఆర్ముగం శివనేశ్వర్ ఎలియాస్ ఏఎస్ ఈశ్వరన్ ఎలియాస్ ఈశ్వర్ (51) మూసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలో నివాసముంటూ గత కొంతకాలంగా ఈశ్వర్ ట్రేడర్స్ పేరుతో కల్తీ నెయ్యి తయారు చేసి కిలో రూ.360లకు విక్రయిస్తున్నాడు. ఈమేరకు విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మలక్‌పేట పోలీసులతో కలిసి శుక్రవారం రాత్రి జరిపి పట్టుకున్నారు. అనంతరం కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కల్తీ నెయ్యిని టిఫిన్ సెంటర్లలో ఇడ్లీ, దోశలలో వాడేందుకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించనున్నట్లు తెలిపారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చే నివేదిక ఆధారంగా కేసులో మార్పు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మలక్‌పేట పోలీసులు తెలిపారు. 8టిన్ల కల్తీ నెయ్యిని ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు కారకుడైన ఈశ్వర్‌ను అరెస్టు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యార్థులకు సూచించారు. మూసారాం బాగ్‌లోని బీసీ హాస్టల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదో తరగతి టర్నింగ్ పాయింట్ అని, దీనిని తేలికగా తీసుకుంటే భవిష్యత్‌లో పెద్ద భారంగా మారుతుందన్నారు. నేను మీ ముందు కలెక్టర్‌గా కూర్చోవడానికి చదువే కారణమని, చదువు ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. రాబోయే రెండు నెలలు ప్రణాళిక ప్రకారం చదివి మంచి మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ పరీక్షల మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, ఆర్‌సీఓ ఆదిత్యవర్మ, హాస్టల్ వార్డెన్లు, అధికారులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడికి ఆకృతి సన్మానం


మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ వెంకయ్య నాయుడిని సన్మానిస్తున్న ఆకృతి నిర్వాహకులు

బంజారాహిల్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో శనివారం ఆకృతి సంస్థ సన్మానించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. వెంకయ్య నాయుడికి అవార్డు లభించడం తెలుగు ప్రజందరికీ అందిన గొప్ప గౌరవం అన్నారు. వెంకయ్యనాయుడుకి సాహిత్యం, కళలు, కళాకారుల పట్ల ప్రత్యేక గౌరవం ఉందని తెలిపారు. వాసవి క్లబ్ స్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వెంకయ్య నాయుడుకు పద్మ విభూషణ్ ప్రకటించిన సందర్భంగా యావత్ తెలుగు ప్రజలందరు పులకించి పోయారన్నారు. కార్యక్రమంలో ఆకృతి సహ కార్యదర్శి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


కర్మన్‌ఘాట్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేస్తున్న సీఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌ల పంపిణీ

చంపాపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ సరస్వతితో కలిసి సీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు హరిత ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సేవలు పేద విద్యార్థులకు ఎంతో అవసరం అన్నారు. విద్యార్థుల చదువుల కోసం మరింత సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌లకు బదిలీల గండం!

● వాస్తు దోషమా...వర్క్ లోపమా..?
● పద్నాలుగేళ్లలో 16 మంది ఇన్‌స్పెక్టర్‌ల బదిలీ
● ఆరోపణల నేపథ్యంలోనే బదిలీలు





చైతన్యపురి పోలీస్ స్టేషన్ , పీఎస్‌లో విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్‌ల జాబితా

దిల్‌సుఖ్‌నగర్, జనవరి27(ఆంధ్రజ్యోతి): ఆ పోలీస్ స్టేషన్‌కు వాస్తు దోషముందా? లేక అక్కడ పనిచేసే ఇన్‌స్పెక్టర్‌ల పనితీరులోపమో..? తెలియదు కానీ ఆస్టేషన్‌లో పనిచేసే ఇన్‌స్పెక్టర్‌లకు మాత్రం కొద్ది నెలలకే స్థానచలనం తప్పడం లేదు. కొంత మందిపై అవినీతి ఆరోపణలతో బదిలీ వేటు పడగా...మరి కొందరు ఇన్‌స్పెక్టర్‌లు విధి నిర్వహణలో నిర్లక్ష్యధోరణి మూలంగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ తీసుకోవాల్సి వస్తుంది. స్టేషన్ ఏర్పాటైన పద్నాలుగేళ్ల కాలవ్యవధిలో ఏకంగా 16మంది ఇన్‌స్పెక్టర్‌లకు స్థానచలనం కలగడం విశేషం. ఇన్‌స్పెక్టర్‌లను బదిలీల టెన్షన్‌కు గురిచేస్తున్న ఆ ఠాణేనే రాచకొండ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్ స్టేషన్.

2010లో ఆవిర్భావం...

సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని కాలనీలు, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరికొంత పరిధిని తీసుకుని 2010 జనవరి 31వ తేదీన చైతన్యపురి పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కొరత ఉండడంతో చైతన్యపురిలో విజయవాడ జాతీయరహదారిని ఆనుకుని ఉన్నటువంటి నాటి గడ్డిఅన్నారం వ్యవసాయమార్కెట్‌కు చెందిన స్థలాన్ని లీజుకి తీసుకుని స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. స్టేషన్ ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు 14 ఏళ్ల కాలవ్యవధిలో సుమారు 16మంది ఇన్‌స్పెక్టర్‌లు బదిలీ అయ్యారు. అయితే అందులో ఇద్దరు ముగ్గురు మాత్రం రెండేళ్ల కాలం విధులు నిర్వర్తించగా, మిగతా వారిలో చాలామంది ఆరోపణల నేపథ్యంలో బదిలీపై వెళ్లాల్సి వచ్చింది. మొదటి నాలుగేళ్ల పాటు సజావుగా కార్యకలాపాలు కొనసాగినప్పటికి, 2014 నుంచి నుంచి సిబ్బంది పనితీరుపై ఆరోపణలు వస్తునే ఉన్నాయి. ఇటీవల ఇద్దరు కానిస్టేబుళ్లు, ఓ హెడ్ కానిస్టేబుళ్లు ముఠాగా ఏర్పడి పిటి వారంట్‌లను బూచిగా చూపి వసూళ్లకు పాల్పడుతూ ఏసీబీకి చిక్కడంతో మరో సారి చైతన్యపురి పోలీస్ స్టేషన్ వార్తల్లో నిలిచింది. ఈ వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్ నాగార్జున చూసీచూడనట్లు వ్యవహరించడంతో పాటు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నాడనే ఆరోపణలతో రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆయనపై బదిలీవేటు వేశారు. దీంతో చైతన్యపురిలో పనిచేయాలంటేనే ఇన్‌స్పెక్టర్‌లు ఒకింత ఆందోళనకు గురవాల్సిన పరిస్థితి నెలకొంది.

పట్టుమని పదినెలలు కూడా చేయని పదిమంది

ఇక మరో పది మంది ఇన్‌స్పెక్టర్‌లు మాత్రం బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి స్టేషన్‌పై పట్టుసాధించి, కుదురుకుంటున్నాం అనేలోపే ట్రాన్స్‌ఫర్ కావాల్సి వచ్చింది. ఆరోపణల నేపథ్యంలో కొందరు.. పనితీరు విమర్శలతో మరొకరు..రాజకీయ ఒత్తిళ్లతో ఇంకొకరు ఇలా ఏ కారణమైనప్పటికి ఏ ఒక్క ఇన్‌స్పెక్టర్ కూడ పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించలేకపోయారు. ప్రవీణ్‌కుమార్ (3 నెలలు), శ్రీనివాస్‌రావు (7 నెలలు), నవీన్‌కుమార్(ఏడున్నర నెలలు), రవీందర్‌రెడ్డి (7 నెలలు), మురళీకృష్ణ (10 రోజులు), సుదర్శన్(9 నెలలు), ఎస్.రావు (3 నెలలు), ఆర్.సైదులు(2 నెలలు), జానకిరెడ్డి(8 నెలలు), వారం రోజుల క్రితం బదిలీవేటుకు గురైన బి.నాగార్జున ఆరున్నర నెలల పాటు మాత్రమే పనిచేశారు.

రెండేళ్లు చేసింది ఆ ఇద్దరే..! నలుగురు ఏడాదిన్నర పాటు

చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఇప్పటి వరకు 16మంది ఎస్‌హెచ్‌వోలు విధులు నిర్వహించగా కేవలం ఇద్దరు మాత్రమే రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వర్తించగలిగారు. స్టేషన్ మొదటి ఇన్‌స్పెక్టర్ ఆనంద్ భాస్కర్ జనవరి31, 2010 నుంచి ఏడాదిన్నరపాటు పనిచేయగా, ఆయన తరువాత ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన శివంనాయుడు సుమారు 28నెలల పాటు ఫిబ్రవరి,2014వరకు పనిచేశారు. ఇక ఆతరువాత వచ్చిన ఇన్‌స్పెక్టర్‌లు చాలా మంది సంవత్సరం లోపే బదిలీ వేటుకు గురయ్యారు. చాలా సంవత్సరాల తరువాత జులై2020లో ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన బి.రవికుమార్ మాత్రమే జూన్2022 వరకు రెండేళ్లపాటు పూర్తికాలం సమర్థవంతంగా పనిచేయగలిగారు. అదేవిధంగా గురురాఘవేంద్ర (ఫిబ్రవరి, 2016- అక్టోబర్, 2017) 19నెలలు, ఎస్.సైదయ్య (అక్టోబర్, 2017-అక్టోబర్, 2018), ఎస్.మధుసుదన్ (జులై, 2022-జులై2023)లు ఏడాదికాలం పాటు ఎలాంటి వివాదాలకు తావులేకుండా పని చేశారు. అయితే ఎన్నికల సమయంలో రాజకీయ ఒత్తిళ్లతో ఎస్.సైదయ్యపై బదిలీవేటు పడింది.

పనితీరులో మార్పు వచ్చేనా..!

ప్రస్తుత రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు హోంగార్డు నుంచి పై స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరి పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతి ఆరోపణలు వెల్లువెత్తినా చర్యలు చేపట్టేందుకు వెనుకాడడం లేదు. ఆరోపణలు వస్తున్న సిబ్బందిపై సమగ్రవిచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే వేటు వేస్తున్నారు.

ఇందులోభాగంగానే విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుళ్ల వసూళ్లదందాకు పాల్పడుతున్నా చోద్యం చూశాడన్న ఆరోపణల నేపథ్యంలో చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ నాగార్జునపై బదిలీవేటు వేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఇప్పటికైనా చైతన్యపురి స్టేషన్ వివాదాలకు దూరంగా, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు దగ్గరవ్వాలని పలువురు కోరుతున్నారు.

బల్దియా.. ఇదేందయ్యా..!

(3వ పేజీ తరువాయి)

రూ.388 నుంచి రూ.435 వరకు(సర్కిళ్లను బట్టి) చెల్లిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. 2022లో మరో ఏజెన్సీతో చేసుకున్న అగ్రిమెంట్ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రవాణా చార్జీల చెల్లింపు ఒకే విధంగా ఉన్నా.. ప్రాసెసింగ్ రుసుము మాత్రం యేడాది మాత్రమే చెల్లిస్తామని ఒప్పందంలో పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో భాగంగా తయారు చేసే ఇటుకలు, పేవర్ బ్లాక్‌లు, ఇతరత్రా ఉత్పత్తులు విక్రయించి ఆదాయం పొందాలని సూచించారు. ఒకే రకమైన పనికి ఒక్కో ఏజెన్సీతో ఒక్కోలా అగ్రిమెంట్లు కుదుర్చుకోవడంపై గతంలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే గత కమిషనర్ సదరు సంస్థకు చెల్లింపులు నిలిపేయాలని, మరో ఏజెన్సీ తరహాలోనే ఒప్పందంలో మార్పులు చేసే విషయాన్ని పరిశీలించాలని సూచించారు.

దీంతో కొన్నాళ్లపాటు బిల్లులకు సంబంధించిన ఫైళ్లను అధికారులు పక్కన పెట్టారు. కమిషనర్ బదిలీపై వెళ్లిన అనంతరం తిరిగి చెల్లింపులు మొదలయ్యాయి. రెండు ఒప్పందాలను పరిశీలిస్తే ఓ సంస్థకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే ఉద్దేశం స్పష్టంగా తెలుస్తోందని పౌర సంస్థ ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సదరు సంస్థకు రూ.60 కోట్లు చెల్లించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరో రూ.10-15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ఆ సంస్థకు బిల్లులివ్వొద్దని గత కమిషనర్ చెప్పిన అనంతరమూ చెల్లింపులు జరగడం గమనార్హం. ఇంకో విషయం ఏమిటంటే.. 95 శాతం వ్యర్థాలకు అన్‌క్లెయిమ్డ్ (ఎవరివో తెలియని) కేటగిరీలో బిల్లులు చెల్లిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్‌రాజన్


యశోద ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభించిన గవర్నర్

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ జబ్బులపై ప్రజలకే కాదు.. ప్రాక్టిషనర్స్‌కు సమగ్ర అవగాహన ఉండాలని, కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్‌రాజన్ అన్నారు. హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో అత్యాధునిక క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సును ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంకా చాలామందికి కిడ్నీ జబ్బులపై సరైన అవగాహన లేదన్నారు. అక్యుట్ కిడ్నీ ఇంజరీస్, క్రానిక్ రీనల్ కిడ్నీ ఫెయిలర్ గురించి చాలా మందికి తెలియదన్నారు. వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. యశోద ఆస్పత్రుల డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. ప్రజల్లో మూత్రపిండాల వ్యాధుల పైన, మూత్రపిండాల ఆరోగ్యం పైన అవగాహన పెంపొందించడానికి శిక్షణ ఇచ్చేందుకు అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన వైద్య నిపుణులు ఈ సదస్సులో పాలుపంచుకోటానికి ఉత్సాహంగా ముందుకు రావటం హర్షణీయమని అన్నారు. కిడ్నీ వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునే విధంగా ఈ ముడు రోజుల అంతర్జాతీయ సదస్సును రుపొందించినట్లు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి వివరించారు.


కథల పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

ఆడ పిల్లలను రక్షించుకుందాం

● సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేట్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకుందాం...సృష్టిని కాపాడుకుందామన్నారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు,, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై వివరించారు. ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టి సారించే దిశగా భారత ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో కార్యక్రమం చేపట్టిందన్నారు. ఆడపిల్లల కలలు, లక్ష్యాలను సాధించడానికి వారికి మద్దతుగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు హెస్సెన్ జాకీర్ విద్యార్థులకు కథల పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ రాంచంద్రారెడ్డితో ఆధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

● జాతీయ జెండా అవనతం చేస్తుండగా...


రాజాబిక్ష (ఫైల్)

పేట్‌బషీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా ఇనుపరాడ్‌ను బయటకు తీస్తుండగా.. ఆ రాడ్‌కి ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాజాబిక్ష(36) కుటుంబ సభ్యులతో కలిసి మేడ్చల్ జిల్లా దేవరయాంజల్ గ్రామంలోని తిరుమల వెంచర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న పాలీకెమ్ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా శుక్రవారం తిరుమల వెంచర్‌లో కాలనీవాసులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాయంత్రం జెండాను అవనతం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు కొంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం భార్య బిస్మిల్లా ఇచ్చిన ఫిర్యాదుమేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి..

మరొకరికి తీవ్ర గాయాలు

వనస్థలిపురం, జనవరి 27 (ఆంధ్ర జ్యోతి): నిద్రమత్తులో ముందు వెళ్తున్న ఆటోను అతివేగంగా వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ఆటో పల్టీకొట్టిన ఘటనలో అక్కడికక్కడే ఒక్కరు మృతి చెందగా, మరొకరు ప్రాణపాయ స్థితిలో ఉన్నారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచెసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు సమీపంలోని రామచంద్రాపురానికి చెందిన కద్దెనూర్ నర్సింగ్‌రావు(54), సిద్దప్ప ఇదరూ కలిసి ఓఆర్ఆర్ నుంచి పటాన్ చెరువుకు శుక్రవారం అర్ధరాత్రి 2గంటలకు తమ ఆటో (టీఎస్15యుసీ0788)లో బీఎన్‌రెడ్డినగర్ మీదుగా వెళ్తున్నారు. అదే సమయంలో వీరి వెనుక నుంచి వస్తున్న నాగోల్ బండ్లగూడకు చెందిన కె.ఎన్.వీ చైతన్య సుబ్రమణ్యం(23) తన ఎక్స్‌యువీ500 (ఏపీ28డీటీ 3183) కారును నిద్రమత్తులో అతివేగంగా నడుపుతూ వెళ్తున్నాడు. బీఎన్‌రెడ్డినగర్‌లోని వాటర్ రిజర్వాయర్ సమీపంలోకి రాగానే చైతన్య సుబ్రమణ్యం తన కారుతో ముందుగా వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆటో పల్టీలు కొడుతూ బోల్తాపడింది. ఆటోలో ఉన్న కద్దెనూర్ నర్సింగ్‌రావు ప్రమాద స్థలంలో అక్కడికక్కడే మృతి చెందగా, సిద్దప్ప తీవ్ర గాయాల పాలై ప్రాణపాయ స్థితిలో ఉన్నాడు. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన నర్సింగ్ రావును పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సిద్దప్పను చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారుతోపాటు చైతన్య సుబ్రమణ్యంను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ఏమైనా మానవ బాంబా లేక నక్సలైటా..?

● మాజీ మంత్రి ఈటల రాజేందర్

ఎల్‌బీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ఏమైనా మానవబాంబా లేక నక్సలైటా అని మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ప్రశ్నించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ భూములను హైకోర్టుకు కేటాయింపును నిరసిస్తు ఉద్యమంలో పోలీసులు జరిగిన పోలీసుల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఝాన్సీని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, వెటర్నరీ విశ్వవిద్యాలయాలకు పెద్దఎత్తున భూములు అవసరం పడుతాయని క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. అలాంటిది రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన భూములను హైకోర్టు నిర్మాణానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తు ఏబీవీపీ విద్యార్థి నాయకులు ఉద్యమిస్తున్నారని ఆయన చెప్పారు.ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల ఆగ్రహానికి గురికాకతప్పదని ఆయన హెచ్చరించారు.


పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

పారిశుధ్య కార్మికులు మరింతగా కృషి చేయాలి

● బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాలనీల పరిశుభ్రతకు పారిశుధ్య కార్మికులు మరింతగా కృషి చెయ్యాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని కాలనీల్లో పారిశుధ్య కార్మికుల పనితీరును శనివారం కార్పొరేటర్ లచ్చిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి కాలనీ పరిశుభ్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పారిశుధ్య కార్మికులదే అన్నారు. విధి నిర్వాహణలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఏ బాలకృష్ణ, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షులు కల్లు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా జిల్లా కోర్టు న్యాయవాది


అలేఖ్య

రంగారెడ్డి కోర్టులు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న పరిమి అలేఖ్య జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి నియామకాల పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన అలేఖ్యను రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ఇతర న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దీకొండ రవీందర్, కార్యదర్శి మాధవరెడ్డి, రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదులు అభినందించారు. అలేఖ్య కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మున్సిపల్ పాలకవర్గం నాలుగో వార్షికోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పాలకవర్గం నాల్గొవ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ కట్ చేశారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నాలుగేళ్లలో మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మరో ఏడాదిలో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల వార్షిక మరమ్మతులు

మన్సూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు ఆయా సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతులను చేపడుతున్నట్లు సరూర్‌నగర్ డీఈ రామకృష్ణ పేర్కొన్నారు. ఈ క్రమంలో శనివారం నాగోల్, మారుతీనగర్‌లలోని 33/11కేవీ సబ్‌స్టేషన్లను, వాటికి అనుసంధానంగా ఉన్న 11కేవీ లైన్లపై చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ బి.సంగమేశ్వర, ఏడీఈలు తిరుపతయ్య, ప్రభాకర్, బాల్యానాయక్ పాల్గొన్నారు.